ఈ వృద్ధితో ఉద్యోగాలు పుట్టవ్

దేశ జీడీపీ ఇంకా పెరిగితేనే కొత్త కొలువులు • ఆర్బీఐ మాజీ గవర్నర్ రాజన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ఇటీవలికాలంలో బలహీనపడ్డ భారత ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. ఇప్పటికే అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ఆర్బీఐ, ఇంకోవైపు ఆయా రేటింగ్ ఏజెన్సీలు కూడా ఇదే అంచనాల్ని వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈసారి జీడీపీ వృద్ధి రేటు అంచనాలను కూడా పెంచుతున్నాయి. అయితే ఈ అంచనాలు ఏమంత గొప్పగా లేవని రాజన్ పెదవి విరిచారు. ప్రస్తుతం చికాగో యూనివర్సిటీ బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రాజన్.. తాజాగా ఓ బ్లూంబర్గ్ టెలివిజన్ ప్రతినిధికి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగానే మాట్లాడుతూ.. దేశ జీడీపీ గాడినపడుతున్నదని ఆనందించాల్సిన అవసరం లేదని, ఇప్పుడున్న వృద్ధి అంచనాలు.. కొత్తగా జాబ్ మార్కెట్‌లోకి రాబోయే వాళ్లకు సరిపడా ఉద్యోగాలను సృష్టించలేవని తేల్చిచెప్పారు.

ఇంకో 2 శాతం పెరగాలి

ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో దేశ జీడీపీ వృద్ధిరేటు 6 శాతానికిపైగానే ఉంటుందన్న అంచనాలు విస్తృతంగా వస్తున్న సంగతి విదితమే. బ్లూంబర్గ్ సర్వేలో ఆర్థికవేత్తలు సైతం ఇదే చెప్పారు. జూలై-సెప్టెంబర్‌తో పోల్చితే (నాడు ఏడు త్రైమాసికాల కనిష్ఠ స్థాయిని తాకుతూ 5.4 శాతంగా నమోదైంది) ఇది ఎక్కువే. అయినప్పటికీ భారత్ ఇంకా మెరుగైన వృద్ధిరేటును సాధించవచ్చని రాజన్ అభిప్రాయపడ్డారు. ఇంకో 2 శాతం పెరిగి 8 శాతం స్థాయిని అందుకోవాలని, అప్పుడే ఏటా మార్కెట్‌లోకి వస్తున్న నిరుద్యోగ యువతకు తగ్గ ఉద్యోగావకాశాలను సృష్టించగలమని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత జనాభా కలిగిన భారత్‌కు ఇప్పుడున్న స్థాయి వృద్ధి సరికాదన్నారు. కాగా, ఈ శుక్రవారం అక్టోబర్-డిసెంబర్‌కుగాను దేశ జీడీపీ గణాంకాలు అధికారికంగా విడుదల కానున్నాయి.

వడ్డీరేట్లు తగ్గిస్తే చాలదు

మందగించిన దేశ జీడీపీ వృద్ధిరేటును పరుగులు పెట్టించేందుకు దాదాపు ఐదేండ్ల తర్వాత ఆర్బీఐ ఇటీవలి ద్రవ్యసమీక్షలో కీలక వడ్డీరేటును పావు శాతం కోత పెట్టినది తెలిసిందే. ఈ నెలారంభంలో కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా రెపో రేటును 6.50 శాతం నుంచి 6.25 శాతానికి తెచ్చారు. దీంతో ఆయా బ్యాంకులూ తమ రుణాలపై వడ్డీరేట్లను తగ్గిస్తున్నాయి. అయితే ఎకానమీని బలపర్చేందుకు ఈ నిర్ణయం ఒక్కటే చాలదని రాజన్ వ్యాఖ్యానించారు. యువతలో నైపుణ్యాభివృద్ధికి దోహదం చేసే చర్యలు కూడా తీసుకోవాల్సి ఉందన్నారు. ఉద్యోగావకాశాలు ఎంతగా పెరిగితే ఆర్థిక వ్యవస్థ కార్యకలాపాలు అంతగట్టిగా సాగుతున్నట్టవుతుందన్నారు.

ట్రంప్ టారిఫ్‌లపై..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తమ దేశంలోకి దిగుమతయ్యే వస్తు,సేవలపై అధిక సుంకాలను ప్రకటిస్తున్నది చూస్తూనే ఉన్నాం. ఈ కారణంగానే దేశీయ స్టాక్ మార్కెట్లు సైతం తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. అయితే ఈ సుంకాలపై రాజన్ స్పందిస్తూ.. అమెరికాతో సత్సంబంధాలు లాభదాయకమని, ఆ దేశం నుంచి చమురు, రక్షణపరమైన కొనుగోళ్లను పెంచడం మంచిదని అభిప్రాయపడ్డారు. అలాగే చాలా వస్తూత్పత్తులపై భారత్ సుంకాలను తగ్గించే వీలుందన్నారు. నిజానికి దీనివల్ల దేశ వృద్ధిరేటు ప్రగతికి వచ్చే నష్టమేమీ లేదన్న ఆయన.. పైగా పరిశ్రమలో పోటీ వాతావరణం నెలకొంటుందని, అది మంచిదేనని వ్యాఖ్యానించారు. ఇక ఆర్బీఐ గవర్నర్‌గా 2013 నుంచి 2016 వరకు రాజన్ పనిచేశారు.

రాష్ట్రంలో మెగా డ్రై పోర్టు

ప్రత్యేక రైలు, రోడ్డు మార్గాలతో ఏపీ సీ పోర్టుకు అనుసంధానం

సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి.. బయోఏషియా-2025 సదస్సు ప్రారంభం

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణ భూ పరివేష్టిత రాష్ట్రం. అందుకే ఇక్కడ ఒక మెగా డ్రై పోర్టును అభివృద్ధి చేసి.. దానికి ఆంధ్రప్రదేశ్‌లోని సీ పోర్ట్‌కు అనుసంధానం ఉండేలా ప్రత్యేక రైలు, రోడ్డు రవాణా సదుపాయాలు అభివృద్ధి చేస్తాం' అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. బయో సైన్సెస్, బయో టెక్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ప్రపంచంలోనే అత్యుత్తమ పర్యావరణ వ్యవస్థకు చిరునామాగా హైదరాబాద్‌ను అభివృద్ధిపర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన పేర్కొన్నారు. బయోఏషియా-2025 వార్షిక సదస్సును మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బయోఏషియా సదస్సు హైదరాబాద్‌ను ప్రపంచ లైఫ్ సైన్సెస్ రాజధానిగా నిలబెట్టిందన్నారు. హెల్త్‌కేర్ రంగంలో ప్రపంచానికి మార్గదర్శనం చేసే కార్యక్రమంగా బయోఏషియా సదస్సు నిలుస్తున్నదన్నారు.

ట్రిలియన్ డాలర్లకు..

ప్రపంచంలో పేరొందిన ఫార్మా కంపెనీలు, హెల్త్ కేర్, లైఫ్ సైన్స్ మరియు బయో టెక్ కంపెనీలెన్నో హైదరాబాద్ నుంచి పని చేస్తున్నాయని, రాబోయే పదేండ్లలో తెలంగాణను ఒక ట్రిలియన్ (లక్ష కోట్లు) డాలర్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ వేదికపై మరో నాలుగు బహుళజాతి కంపెనీలను మా పర్యావరణ వ్యవస్థలోకి స్వాగతిస్తున్నామన్న ఆయన.. గత 25 సంవత్సరాలలో హైదరాబాద్.. ఫార్మా తయారీ, ఐటీ, డిజిటల్ హెల్త్ పవర్ హౌస్‌గా పేరుగాంచిందన్నారు. కాగా, జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డును పొందిన ప్రొఫెసర్ పాట్రిక్ టాన్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

క్వీన్స్‌లాండ్ ప్రతినిధులతో సమావేశం..

ఆస్ట్రేలియాలోని క్వీన్స్ ల్యాండ్ స్టేట్ ప్రతినిధులతో హైచ్ఐసీసీలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో పరిశ్రమలు, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ట్రేడింగ్, ఇతర రంగాల్లో పెట్టుబడులు, ఒప్పందాలపై చర్చించారు. వారు సానుకూలంగా స్పందించారు.

ఎట్టకేలకు లాభాల్లోకి సూచీలు

సెన్సెక్స్ 148 పాయింట్లు వృద్ధి

ముంబై, ఫిబ్రవరి 25: దేశీయ స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు లాభాల్లోకి మళ్లాయి. వరుసగా ఐదు రోజులుగా పతనమైన సూచీలకు ఫైనాన్షియల్, ఎఫ్ఎంసీజీ షేర్ల నుంచి లభించిన మద్దతుతో తిరిగి కోలుకున్నాయి. ఇంట్రాడేలో 300 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 147.71 పాయింట్ల లాభంతో 74,602 వద్ద నిలిచింది. మరో సూచీ నిఫ్టీ మాత్రం వరుసగా ఆరోరోజూ నష్టపోయింది. 5.80 పాయింట్లు కోల్పోయి 22,547.55 వద్దకు జారుకున్నది. ఫార్మా, మెటల్, ఐటీ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడంతో సూచీ తగ్గుముఖం పట్టింది. మార్కెట్లో మహీంద్రా అండ్ మహీంద్రా 2.61 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. భారతీ ఎయిర్‌టెల్ 2.55 శాతం బలపడింది. దీంతో పాటు జొమాటో, నెస్లె, బజాజ్ ఫిన్‌సర్వ్, మారుతి, టైటాన్ షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, సన్ ఫార్మా, పవర్ గ్రిడ్, టీసీఎస్, టెక్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, టాటా మోటర్స్ షేర్లు నష్టపోయాయి. గత ఐదు సెషన్లలో సెన్సెక్స్ 1,542.45 పాయింట్లు లేదా 2 శాతం మేర నష్టపోయిన విషయం తెలిసిందే.

ప్రైవేటుకు 13 ఎయిర్‌పోర్టులు?

వచ్చే ఏడాది మార్చికల్లా అమ్మేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: విమానాశ్రయాల ప్రైవేటీకరణను మోదీ సర్కారు మళ్లీ మొదలు పెట్టింది. ప్రభుత్వ ఆస్తుల నగదీకరణ నుంచి పెద్ద ఎత్తున ఆదాయాన్ని పొందాలన్న లక్ష్యం పెట్టుకున్న కేంద్రం.. ఏకంగా వచ్చే ఏడాది మార్చికల్లా దేశంలోని 13 ఎయిర్‌పోర్టులను ప్రైవేట్‌పరం చేయాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది. ఇప్పటికే పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఈ అంశాన్ని ఇంటర్-మినిస్టీరియల్ కన్సల్టేషన్‌లో ప్రస్తావనకు తీసుకొచ్చినట్టు కూడా చెప్తున్నారు.

ఇదీ సంగతి..

జాతీయ నగదీకరణ ప్రణాళిక కింద 2022 నుంచి 2025 వరకు మొత్తం దేశవ్యాప్తంగా 25 ఎయిర్‌పోర్టులను ప్రైవేట్‌పరం చేయాలని కేంద్రం నిర్ణయించుకున్నది. వీటిలో భువనేశ్వర్, వారణాసి, అమృత్‌సర్, తిరుచ్చి, ఇండోర్, రాయ్‌పూర్, కాలీకట్, కోయంబత్తూర్, నాగ్‌పూర్, పాట్నా, మధురై, సూరత్, జోధ్‌పూర్, రాంచీ, చెన్నై, విజయవాడ, రాజమండ్రి, వడోదర, భోపాల్, తిరుపతి, హుబ్లీ, ఇంఫాల్, అగర్తల, డెహ్రాడూన్, ఉదయ్‌పూర్ ఉన్నాయి. ఈ క్రమంలోనే ముందుగా ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బోర్డు (ఏఏఐ) 13 ఎయిర్‌పోర్టులను గుర్తించింది. దీంతో వీటి ప్రైవేటీకరణకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కేబినెట్ అనుమతికి సిద్ధమైంది. అయితే మధ్యప్రదేశ్ ప్రభుత్వం.. రాయ్‌పూర్, ఇండోర్ విమానాశ్రయాల ప్రైవేటీకరణకు అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో సదరు జాబితా 11 ఎయిర్‌పోర్టులకు తగ్గింది. ఈలోగా గత ఏడాది లోక్‌సభ ఎన్నికలు రావడంతో ప్రైవేటీకరణకు బ్రేక్ పడింది. కానీ మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే కొలువుదీరడంతో ఇప్పుడిక మళ్లీ విమానాశ్రయాల ప్రైవేటీకరణపై సర్కారు పెద్దలు దృష్టి సారించారు.

విమర్శలు వస్తున్నా..

ఎయిర్‌పోర్టుల ప్రైవేటీకరణపై రాష్ట్రాల నుంచి గట్టిగానే విమర్శలు వస్తున్నాయి. లాభాల్లో ఉన్న విమానాశ్రయాలు ఈ దెబ్బతో నష్టాల్లోకి జారుకుంటాయని, ప్రైవేట్ రంగంలో కొన్ని బడా కార్పొరేట్ సంస్థల గుత్తాధిపత్యంలోకి దేశీయ విమానయాన పరిశ్రమ వెళ్లిపోతుందన్న వాదనలూ వినిపిస్తున్నాయి. ప్యాసింజర్లపై అనవసరపు చార్జీలు వచ్చిపడతాయని, పారదర్శకత లోపిస్తుందని అంటున్నారు. ముఖ్యంగా అదానీ గ్రూప్ కోసమే ఈ ప్రైవేటీకరణ తంతు అన్న ఆరోపణలూ వస్తున్నాయి. ఇక ఇప్పటికే వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఈ నెల 1న పార్లమెంట్‌లో ప్రకటించిన బడ్జెట్‌లో.. రాబోయే ఐదేండ్లలో ప్రభుత్వ ఆస్తులను అమ్మి రూ.10 లక్షల కోట్లను ఖజానాకు తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎయిర్‌పోర్టుల ప్రైవేటీకరణ తిరిగి పట్టాలెక్కుతున్నది. ఇదిలావుంటే ప్రైవేటీకరణ ప్రక్రియలో భాగంగా తొలిసారి 6 పెద్ద ఎయిర్‌పోర్టులతో 7 చిన్న ఎయిర్‌పోర్టులను కలిపేయాలని భావిస్తున్నారు. వారణాసితో ఖుషీనగర్-గయా, అమృత్‌సర్‌తో కంగ్రా, భువనేశ్వర్‌తో తిరుపతి, రాయ్‌పూర్‌తో ఔరంగాబాద్, ఇండోర్‌తో జబల్‌పూర్, తిరుచిరాపల్లితో హుబ్లీ క్లబ్ చేయాలని చూస్తున్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

- **సీఎంకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ లేఖ**

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జర్నలిస్టుల దీర్ఘకాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. చాలీచాలని వేతనాలతో జీవితాలను అనుభవిస్తున్న జర్నలిస్టులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనేక ఉద్యమాల్లో పాత్రికేయుల పాత్ర మరువలేనిదని.. పదేండ్లుగా వివిధ కారణాలతో దాదాపు 500 మందికిపైగా జర్నలిస్టులు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు, జర్నలిస్టు బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు.

నిలోఫర్‌లో ప్రొఫెసర్ల బృందం విచారణ!

- **బ్లడ్‌బ్యాంక్ అవినీతిపై కొనసాగిన విచారణ**

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): నిలోఫర్ బ్లడ్‌బ్యాంక్ అవకతవకల అంశంలో కీలక పరిణామం చోటుచేసుకున్నది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఐదుగురు ప్రొఫెసర్ల బృందం బ్లడ్‌బ్యాంక్ స్టాఫ్‌ను మంగళవారం విచారించినట్టు తెలిసింది. బ్లడ్‌బ్యాంక్ నుంచి అర్ధరాత్రి బ్యాగ్‌లు బయటకు వెళ్తుంటే ఏం చేశారని కమిటీ సిబ్బందిని నిలదీసింది. ఈ వ్యవహారాన్ని తాను చూసుకుంటానని సూపరింటెండెంట్ సమాచారం ఇచ్చారని సిబ్బంది విచారణ కమిటీకి తెలిపింది. తాము చెప్పిన తర్వాత మెడికల్ సూపరింటెండెంట్ వీడియో ఫుటేజీ చెక్ చేశారని, అందులో బ్యాగ్‌లు తీసుకెళ్తున్నట్టు స్పష్టంగా కనిపించినట్టు సిబ్బంది విచారణ కమిటీకి తెలిపింది. బ్లడ్‌బ్యాంక్ స్టాఫ్ చెప్పిన వివరాలను ప్రొఫెసర్ల కమిటీ స్టేట్‌మెంట్ రూపంలో రికార్డు చేసినట్టు తెలిసింది. కేసులు ఉన్న వ్యక్తిని బ్లడ్‌బ్యాంక్‌లో ఎలా పనిచేయనిస్తారని ప్రొఫెసర్ల బృందం ఆశ్చర్యం వ్యక్తంచేసింది. పలు కోణాల్లో విచారించిన కమిటీ త్వరలో నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి ఇవ్వనున్నది. మరోవైపు నిలోఫర్ దవాఖాన అడ్మినిస్ట్రేషన్ నిర్లక్ష్యంపై సర్కారు స్క్రీనింగ్ నిర్వహిస్తున్నది. వరుసగా వస్తున్న ఫిర్యాదులు, ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం అలర్ట్ అయింది. బ్లడ్‌బ్యాంక్ అక్రమాలు, సూపరింటెండెంట్‌పై వరుసగా వస్తున్న ఆరోపణల నేపథ్యంలో కమిటీ మరిన్ని వివరాలు సేకరించనున్నది. దీంతోపాటు ఫోర్త్‌క్లాస్ ఉద్యోగుల ప్రవర్తన, స్టాఫ్ పనితీరుపై కూడా కమిటీ ఫీడ్‌బ్యాక్ తీసుకోనున్నట్టు సమాచారం.

లా కోర్సుల్లో మల్టిపుల్ ఎంట్రీ అండ్ ఎగ్జిట్

- **బీకాం, బీబీఏ కోర్సుల్లోనూ అమలు**
- **ఇక నుంచి మెంటారింగ్, కౌన్సెలింగ్ తప్పనిసరి**
- **సిఫారసు చేసిన నిపుణుల కమిటీ**

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో మల్టిపుల్ ఎంట్రీ, ఎగ్జిట్‌కు అవకాశం కల్పించాలని ఉన్నత విద్యామండలి నియమించిన నిపుణుల కమిటీ సూచించింది. బీకాం, బీబీఏ కోర్సుల్లోనూ మల్టిపుల్ ఎంట్రీ, ఎగ్జిట్‌కు అవకాశం ఇవ్వాలని స్పష్టంచేసింది. ఇక సెకండియర్‌లో చేరేందుకు ల్యాటరల్ ఎంట్రీకి, రీ ఎంట్రీకి సైతం అవకాశం కల్పించాలని కమిటీ సూచించింది. బీకాం, బీబీఏ, లా కోర్సుల సిలబస్‌లో మార్పుల కోసం నియమించిన నిపుణుల కమిటీ మంగళవారం మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి అధ్యక్షతన భేటీ అయ్యింది. ఈ సందర్భంగా బీకాం, బీబీఏ, లా కోర్సు సిలబస్‌లో 15-20శాతం మార్పులు చేయాలని నిర్ణయించారు. యూనైటెడ్ నేషన్స్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌కు అనుగుణంగా సిలబస్ రూపొందించాలని, లా కోర్సుల్లో కొత్తగా సైబర్‌లాను ప్రవేశపెట్టాలని, ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్ట్‌లు తప్పనిసరిచేయాలని నిపుణుల కమిటీ సూచించింది.

కమిటీ సిఫారసులు..

- డిగ్రీ, పీజీ కోర్సుల్లో పునరావృతమవుతున్న పాఠ్యాంశాలను తొలగించాలి. డిగ్రీలో ఉన్న పాఠాలు పీజీలోనూ ఉంటే డిగ్రీ సిలబస్ నుంచి ఉపసంహరించాలి.
- బీబీఏ, బీకాం, ఎల్ఎల్‌బీ కోర్సుల్లో జనరేటివ్ ఏఐ వంటి టెక్నాలజీ, స్కిల్ బేస్డ్ పాఠ్యాంశాలను అంతర్భాగం చేయాలి.
- విద్యార్థులు ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం అయిన స్వయం, మూక్స్, ఎన్‌పీటీఎల్ కోర్సులను తీసుకునే అవకాశం కల్పించాలి.
- విద్యార్థులకు అకడమిక్, ప్రొఫెషనల్‌గా రాణించేందుకు మెంటారింగ్, కౌన్సెలింగ్ తప్పనిసరి.
- ఇండస్ట్రీ, స్టార్టప్ భాగస్వామ్యాలు, ఇంటర్న్‌షిప్‌లను ప్రోత్సహించాలి.
- ఇంజినీరింగ్ కాలేజీల్లోని సాంకేతిక వనరులను వినియోగించుకునేందుకు ఆయా కాలేజీలతో ఇంజినీరింగ్ కాలేజీలను అనుసంధానించాలి.

ప్రమాదకరస్థాయికి వాయు నాణ్యత

- **హైదరాబాద్‌లో 431 ఏక్యూఐ నమోదు : తెలంగాణ పీసీబీ**



హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలో వాయుకాలుష్యం పెరిగి ప్రమాద సంకేతాలకు దారితీస్తున్నది. విద్యుత్తు కోతల కారణంగా జనరేటర్ల వినియోగం పెరుగుతున్నదని.. ఫలితంగా వాయు నాణ్యత క్షీణిస్తున్నదని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీఎస్‌పీసీబీ) అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యంతో పరిస్థితి ఆందోళనకరంగా మారగా, ఇప్పుడు హైదరాబాద్ నగరంలోనూ ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా సనత్‌నగర్ ప్రాంతంలో ఎయిర్ క్వాలిటీ ప్రమాదకర స్థాయికి చేరుకున్నది. సోమవారం మధ్యాహ్నం ఏకంగా 431 ఏక్యూఐ (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్) నమోదైనట్టు తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు తెలిపారు. మరోవైపు నగరంలో సగటున 108 ఏక్యూఐ నమోదైనట్టు అధికారులు తెలిపారు. జూపార్క్‌లో 135, పటాన్ చెరువులో 112 తప్ప గ్రేటర్ పరిధిలో గాలి నాణ్యతను సూచించే 14 స్టేషన్లలో ఎక్కడా 100 ఏక్యూఐ దాటలేదని అధికారులు వివరించారు.

సనత్‌నగర్‌లోనే ఎందుకు ఎక్కువ అంటే?

సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ప్రాంతం కావడంతో అక్కడ సాధారణంగానే అసాధారణ వ్యాల్యూస్ నమోదవుతుంటాయని అధికారులు తెలిపారు. సనత్‌నగర్‌లో నిరుడు నవంబర్ 25న 298, డిసెంబర్‌లో 229, గత జనవరిలో 171 ఏక్యూఐ నమోదైంది. ఎప్పుడూ లేనంతగా సోమవారం రోజున ప్రమాదకర స్థాయిలో వ్యాల్యూస్ నమోదు కావడం ఆందోళన కలిగిస్తున్నది. సనత్‌నగర్‌లో ఎయిర్‌క్వాలిటీ లెక్కించే మీటర్ పక్కన రెండు కంపెనీల జనరేటర్లు ఉన్నాయని టీజీపీసీబీ సీనియర్ శాస్త్రవేత్త ప్రసాద్ తెలిపారు. ఒక్కోసారి గాలి ఎక్కువ వీచినప్పుడు ఎయిర్ క్వాలిటీ లెవల్స్ పడిపోతుంటాయని చెప్పారు. జనరేటర్ల కారణంగానే సోమవారం మధ్యాహ్నం 431 ఏక్యూఐ నమోదై ఉండొచ్చని, దానికి భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు.

ఏక్యూఐ స్థాయిలు - పరిణామాలు

0-50	గాలి స్వచ్ఛత
51-100	సంతృప్తికరస్థాయి
101-200	అనారోగ్యకరం
201-301	తీవ్ర అనారోగ్యకరం
301-400	అత్యంత ప్రమాదకరం
401-500	తీవ్ర ప్రమాదకరస్థాయి

ఎల్ఆర్ఎస్ రాయితీలకూ ఆదరణ కరవు

- **ఉచితహామీ మాటతప్పడంపై జనాగ్రహం**
- **25% డిస్కౌంట్ ఉన్నా ప్రజల నిరాసక్తి**
- **దరఖాస్తులు 25.60 లక్షలు**
- **ఫీజులు చెల్లించింది 1.90 లక్షలే**
- **పెండింగ్‌లో 23.70 లక్షల దరఖాస్తులు**
- **మార్చి 31వరకే గడువు**

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) వన్‌టైం సెటిల్‌మెంట్‌పై ప్రజల్లో ఆదరణ తగ్గుతున్నది. గత ఎన్నికల ముందు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా పరిష్కరిస్తామన్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక బలవంతంగా ఫీజులు వసూలు చేస్తున్నది. మాటతప్పిన రేవంత్ సర్కారుపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. దీంతో ఎల్ఆర్ఎస్ కోసం 2020లో చేసుకున్న దరఖాస్తుదారులు ఎవ రూ ఇప్పుడు ఆసక్తి చూపడం లేదు. ఎల్ఆర్ఎస్ కోసం ఫీజు చెల్లించే వారి సంఖ్య చాలా స్వల్పంగా ఉండటం గమనార్హం. దీంతో సర్కారుకు నిధుల సమీకరణ కష్టతరంగా మారడంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు 25% డిస్కౌంట్ ప్రకటించింది. దీనికోసం మార్చి 31లోపు గడువు విధించింది. అయి నా దరఖాస్తుదారులు పట్టించుకోవడమే లేదు. వచ్చిన మొత్తం దరఖాస్తుల్లో కనీసం 10% మంది కూడా ముందుకురాలేదు. ఎల్ఆర్ఎస్ కోసం 2020లో దాదాపు 25.60 లక్షల మంది లే అవుట్ రెగ్యులరైజేషన్ కోసం రూ.1,000 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారిలో ఇప్పటివరకు 1.90 లక్షల మంది మాత్రమే ఫీజు చెల్లించారు. ఇంకా 23.70 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. వాటిలో శాఖల వారీగా తనిఖీలు చేస్తున్నారు.

ఎల్ఆర్ఎస్ వివరాలు

దరఖాస్తుదారులు	25.60 (2020)
ఫీజు చెల్లించినవారు	1.90 లక్షల మంది
పెండింగ్	23.70
గడువు	2025 మార్చి 31
డిస్కౌంట్	25%

రైల్వే టికెట్ కొనుగోలుపై 3% క్యాష్ బ్యాక్

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): యూటీఎస్ మొబైల్ యాప్‌లో ఆర్-వాలెట్ ద్వారా రైల్వే జనరల్ టికెట్ కొనుగోలు చేసిన ప్రయాణికులకు 3% డిస్కౌంట్ ఇస్తున్నట్టు రైల్వే అధికారులు వెల్లడించారు. 2016లో తొలుత హైదరాబాద్ జంట నగరాలల్లో 26 సబర్బన్ స్టేషన్లలో 'యూటీఎస్' మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఆర్-వాలెట్‌తోపాటు పేటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పే, యూపీఐ యాప్ ద్వారా టికెట్ కొనుగోలు చేయవచ్చని పేర్కొన్నారు.

జలవిద్యుత్తు ఉత్పత్తిపై విచారణ 18కి వాయిదా

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): జలవిద్యుత్తు ఉత్పత్తి కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 34ను రద్దు చేయాలని కోరుతూ ఏపీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టులో విచారణ మార్చి 18కి వాయిదా పడింది. తెలంగాణలో సాగునీటి అవసరాలతో పాటు ఎత్తిపోతల పథకాల నిర్వహణ కోసం స్థాపిత సామర్థ్యం మేరకు జలవిద్యుత్తును ఉత్పత్తి చేయాలని గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి, జీవో 34ను జారీ చేయగా ఏపీ సర్కారు అభ్యంతరం తెలిపింది. పరిమితులు లేకుండా విద్యుత్తు ఉత్పత్తికి నీటిని మళ్లించడం సరికాదని, ఆ జీవోను రద్దు చేయాలని సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఆ పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఏపీ తరపున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు వినించారు. వాటిపై అభిప్రాయాలను తెలపాలని తెలంగాణ తరపు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించి 2 వారాల్లోగా వివరాలను సమర్పిస్తానని వైద్యనాథన్ స్పష్టం చేయడంతో తదుపరి విచారణను మార్చి 18కి వాయిదా వేసింది.

ఇంజినీరింగ్ ఫీజుల సవరణపై విచారణ

తొలిరోజు హాజరైన ఆరు కాలేజీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ) : ఇంజినీరింగ్ ట్యూషన్ ఫీజుల సవరణపై తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ(టీఏఎఫ్ఆర్‌సీ) విచారణ షురూ అయ్యింది. తొలిరోజు మాసాబ్ ట్యాంక్‌లోని టీఏఎఫ్ఆర్‌సీ కార్యాలయంలో విచారణ చేపట్టారు.19 కాలేజీల వారిని పిలవగా తొలిరోజు ఆరు కాలేజీలకు చెందిన